ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

బుధవారం 12 ఫిబ్రవరి 2025

జిల్లాల వార్తలు



హల్దీవాగులో గోదావరి పరవళ్లు

హల్దీవాగులో గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. హక్కింపేట శివారులోని హల్దీప్రాజెక్ట్ మత్తడి దూకుతున్నది. ప్రాజెక్ట్ నుంచి వస్తున్న గోదావరి జలాలు వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్, వెల్దుర్తి-1 చెక్‌డ్యామ్‌లలోకి చేరి అలుగు పారుతుడడంతో రైతన్నలు మురిసిపోతున్నారు. హల్దీవాగు పరీవాహక ప్రాంత రైతులకు నీటి ఇబ్బందులు తీరనున్నాయి.

-వెల్దుర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి)





సంగారెడ్డిలోని అంబేడ్కర్ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐబీసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డికి ప్రతిపాదనలు అందజేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐబీసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

అంబేడ్కర్ స్టేడియం అభివృద్ధికి రూ.32 కోట్ల ప్రతిపాదనలు

సంగారెడ్డిలో స్పోర్ట్స్ హాస్టల్, ఇండోర్ స్టేడియం, రన్నింగ్ ట్రాక్, అన్ని క్రీడలకు సౌకర్యాలు కల్పించాలి

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డికి వినతిపత్రం అందజేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బీఆర్ అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్ అభివృద్ధి కోసం రూ.32 కోట్లు మంజూరు చేయించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డిని కోరారు. ఈమేరకు టీజీఐబీసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన ప్రతిపాదనలు అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం, బాస్కెట్ బాల్, కబడ్డీ, షటిల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, జిమ్, ఔట్ డోర్‌లో సింథటిక్ 800 మీటర్స్ రన్నింగ్ ట్రాక్, ఫుట్‌బాల్, హాకీ, ఖోఖో, బాక్స్ క్రికెట్ అన్ని క్రీడలను అభివృద్ధి చేసేందుకు గాను సుమారు రూ.32 కోట్లు అవసరం ఉంటుందన్నారు. ఈ నిధులను త్వరగా మంజూరు చేయించాలన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని జగ్గారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్‌నాయక్, కంది మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతీలాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు పట్టణం శాంతి నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి నాంపల్లి సత్యనారాయణకు ఫెడిలిటీ ఇంటర్నేషనల్ వాట్సాప్ గ్రూప్‌లో చేరాలని జనవరి నెలలో సైబర్ నేరగాళ్లు ఒక లింకును పంపారు. తాము చెప్పినట్టు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్దఎత్తున లాభాలు వస్తాయని నమ్మించారు. అత్యాశకుపోయిన సత్యనారాయణ తన రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.13,58,700 వారి ఖాతాలకు బదిలీ చేశాడు. కొద్దిరోజులకు లాభాలు రాకపోగా డబ్బు తిరిగి ఇవ్వాలని ఎన్నిసార్లు వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టినా స్పందన రాలేదు. మోసపోయినట్లు గ్రహించి 1930 నంబర్ ద్వారా సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేశారు. పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డి పట్టణానికి చెందిన వ్యాపారి అరవింద్ ఫోన్‌కు ఆయన కుమారుడు చదువుతున్న కాలేజీ నుంచి ఫీజు చెల్లించాలని కోరుతూ గత సంవత్సరం డిసెంబరు నెలలో ఒక లింకు వచ్చింది. లింకు ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసి రూ. 95వేలు చెల్లించాడు. తీరా చూస్తే ఆ ఫీజు కాలేజీ యాజమాన్యానికి చేరలేదు. కాలేజీ ఫీజు పేరిట సైబర్ నేరగాళ్లు లింకు పంపినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కొట్టేసింది కొండంత..

సైబర్ నేరాల బాధితులకు తిరిగి అందని డబ్బు

మోసగాళ్లు కొట్టేసింది రూ. 47.84 కోట్లు

రికవరీ చేసింది కేవలం రూ. 2.20 కోట్లు

సైబర్ నేరాల పరిష్కారంలో రాష్ట్రంలోనే సంగారెడ్డి పోలీసులకు మూడో స్థానం

అయినా.. రికవరీ చేసింది స్వల్పమే!

తిరిగొచ్చింది కొంతే!

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోయింది. ప్రతీ సంవత్సరం వందల్లో కేసులు నమోదవుతుండగా కోట్లాది రూపాయలు సైబర్ నేరగాళ్లు కొట్టేస్తున్నారు. డబ్బు పోగొట్టుకున్న బాధితులకు కేవలం ఐదు శాతం మాత్రమే తిరిగి వస్తోంది. 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు జిల్లాలో మొత్తం సైబర్ కేసులు 793 నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్లు అమాయకుల ఖాతాల నుంచి రూ.47,84,40,786 కొల్లగొట్టారు. ఇందులో బాధితులు సకాలంలో ఫిర్యాదు చేయడంతో బ్యాంకుల్లో రూ. 5,90,33,430 హోల్డ్ చేయడం జరిగింది. అయితే, బాధితులకు తిరిగి వచ్చింది కేవలం రూ. 2,20,66,184 మాత్రమే. పోగొట్టుకున్న డబ్బులో కేవలం 5 శాతం మాత్రమే బాధితుల ఖాతాలకు తిరిగి వచ్చింది. జిల్లాలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రపురం, సంగారెడ్డి ప్రాంతాల్లో ఎక్కువ సైబర్ కేసులు నమోదువుతున్నాయి. సిర్గాపూర్, మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో అతి తక్కువ కేసులు వెలుగు చూస్తున్నాయి.

లింకు ఓపెన్ చేస్తే ఖాతా ఖాళీ..

ప్రతీ ఒక్కరి వద్ద స్మార్ట్‌ఫోన్ ఉండటంతో సైబర్ మోసగాళ్లు వివిధ రకాల ప్రకటనల పేరిట లింకులు పంపుతున్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, కొన్ని ప్రదేశాలకు లైకులు కొట్టడం వంటివి చేస్తే రూ.వేలల్లో సంపాదించవచ్చని ఆశ చూపిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల బారిన అమాయకులు పడగానే వారి ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ భయం

సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో బాధితులను భయాందోళనకు గురిచేస్తున్నారు. వివిధ మార్గాల

మిగతా 8వ పేజీలో

గత సంవత్సరం సైబర్ నేరాల వివరాలు	
సైబర్ నేరగాళ్లు కొట్టేసింది	రూ.47,84,40,786
బ్యాంకులో హోల్డ్ చేసింది	రూ. 5,90,33,430
బాధితులకు అప్పగించింది	రూ. 2,20,66,184
జిల్లాలో మొత్తం ఫిర్యాదులు	3,801
కేసులు	793

నాలుగేళ్లలో నమోదైన సైబర్ క్రైం కేసులు

సంవత్సరం	కేసులు
2021	35
2022	217
2023	323
2024	793





సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఎన్నికల విధుల నిర్వహణలో

అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు ఎన్నికల విధులపై మంగళవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు జాగ్రత్తగా ఎలాంటి దోషాలు లేకుండా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎంత అనుభవం ఉన్నప్పటికీ శిక్షణ చాలా అవసరమని, అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. నిబంధనలపై ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి వివాదాలు, తప్పులు దొర్లకుండా నిబంధనలు పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామపంచాయతి ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, ఎన్నికల సంఘం ద్వారా జారీ చేసిన కరదీపికలను చదువుకుని ఈసీ మార్గదర్శకాల మేరకు ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలని చెప్పారు.

పుకార్ల మోతే..!

వరుస మరణాల ఆసరాగా వివాదాలు

ఆ చావుల వెనుక ఆర్థిక, అనారోగ్య సమస్యలు

ఇరువర్గాల మధ్య విభేదాలతో తప్పుడు ప్రచారం

పుకార్ల కట్టడికి నేడు గ్రామసభ

7లో



హోరాహోరీగా దంగల్...

8లో

టేక్మాల్ మండలం వేల్పుగొండ తుంబురేశ్వర స్వామి ఉత్సవాలు, న్యాల్‌కల్ పీర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉర్సులో పోటీలు



ఈ జైలు.. ఇక చరిత్రే..!

కనుమరుగు కానున్న 229 ఏళ్ల నాటి సంగారెడ్డి జైలు మ్యూజియం

శిథిలావస్థకు చేరిన భవనం

7లో

అనుమానాలు.. ఆందోళనలు..

నల్లవల్లి పరిధిలో డంప్‌యార్డు ఏర్పాటుపై వ్యతిరేకత

అడవి, పంట పొలాలకు ముప్పు తప్పదని ఆందోళన

గుమ్మడిదల, నర్సాపూర్ మండలాల్లో ఆగని నిరసనలు

నర్సాపూర్, ఫిబ్రవరి 11: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతానికి అతీ సమీపంలోని ప్యారానగర్ పరిధిలో జీహెచ్ఎంసీ డంప్‌యార్డు ఏర్పాటు చేస్తుండటంతో ఈప్రాంత వాసుల్లో ఆందోళన మొదలైంది. డంప్‌యార్డుతో పచ్చని అటవీప్రాంతం దెబ్బతింటుందని ప్రజలు ఆందోళనలు చేస్తుంటే.. మరోవైపు పోలీసు బందోబస్తు మధ్య హెచ్ఎండీఏ పనులు ముమ్మరంగా చేస్తున్నది. బందోబస్తు కోసం ప్రత్యేకంగా పోలీసు క్యాంపునే ఏర్పాటు చేయడం గమనార్హం.

పదిహేనేళ్ల క్రితమే భూ కేటాయింపు

ఇక్కడ డంప్‌యార్డు ఏర్పాటుకు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పడే 2008-09 సంవత్సరంలో 150 ఎకరాల భూమిని కేటాయించారు. అప్పటి నుంచి డంప్‌యార్డు నిర్మాణానికి అధికారులు ప్రయత్నాలను చేస్తుండగా.. ఎప్పటికప్పుడు స్థానికులు అడ్డుకుంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా డంప్‌యార్డు ఏర్పాటుకు తీవ్రంగా ప్రయయత్నాలు సాగించినా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కుతగ్గారు. ప్రస్తుతం పోలీసు బందోబస్తు మధ్య పనులు ప్రారంభించారు.

ఆందోళనలు.. అరెస్టులతో ఉద్రిక్తత

డంప్‌యార్డు నిర్మాణంపై నర్సాపూర్, గుమ్మడిదల మండలాల్లో వ్యతిరేకత వెల్లువెత్తుతున్నది. ప్రజలు, రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆందోళనలు చేస్తున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సైతం ఆందోళనల్లో పాల్గొన్నారు. డంప్‌యార్డు వల్ల నల్లవల్లి ప్రాంతమే కాకుండా సమీపంలోని నర్సాపూర్ అడవులు కలుషితమవుతాయని, కాలుష్యకారక వ్యర్థ జలాలు వర్షపు నీటితో కలిసి అటవీ ప్రాంతంలోని చెక్‌డ్యాంలు, కాలువలు, నర్సాపూర్ చెరువులోకి చేరుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపూర్ చెరువు నుంచి నీరు రామచంద్రాపూర్, ఆవంచ, నస్తీపూర్, కాసాల మీదుగా మంజీర నదిలో కలుస్తాయని పేర్కొంటున్నారు. అటవీ ప్రాంతం, మంజీర నది, చుట్టుపక్కల గ్రామాల్లో పంట పొలాలు, భూగర్భ జలాలు దెబ్బతింటాయని ప్రజలు వాపోతున్నారు. డంప్‌యార్డు వద్దని పార్టీలకతీతంగా జేఏసీని ఏర్పాటు చేసుకుని ఆందోళనలు చేస్తున్నారు. మరోవైపు డంప్‌యార్డు స్థలానికి పక్కనే ఇండియన్ ఏయిర్‌ఫోర్సు అకాడమీ ఉంది. డంపుయార్డు వ్యర్థాల కోసం వచ్చే పక్షులతో విమానాలకు ప్రమాదముంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. డంప్‌యార్డుపై ఆందోళన వద్దని అధికారులు పేర్కొంటున్నారు. శాస్త్రీయ విధానాలు అవలంబించి కాలుష్య ప్రభావం లేకుండా విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే వ్యర్థాలను మాత్రమే ప్యారానగర్‌కు తీసుకువస్తామని పేర్కొంటున్నారు.



డంప్‌యార్డు నిర్మాణ స్థలానికి వెళ్లే మార్గంలో పోలీసు బందోబస్తు

ప్రభుత్వం దిగొచ్చేవరకు ఉద్యమిస్తాం

గుమ్మడిదల మండల రైతు జేఏసీ అల్టిమేటం

గుమ్మడిదల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్యారానగర్ శివారులో డంప్‌యార్డును వ్యతిరేకిస్తూ చుట్టుపక్కల గ్రామస్థులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఎనిమిది రోజులుగా గ్రామాల్లో నిరసనలు, ఆందోళనలు, దీక్షలు, ర్యాలీలు కొనసాగుతూనే ఉన్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లవల్లి, దోమడుగు, గుమ్మడిదల గ్రామాల్లో ప్రజలు విభిన్న రూపాల్లో నిరసనలు చేపట్టారు. నల్లవల్లి, కొత్తపల్లిలో ప్రజలు మోకాళ్లపై నిరసన తెలిపారు. దోమడుగులో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు ప్రదర్శించారు. గుమ్మడిదలలో రైతులు ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. గుమ్మడిదల బస్టాండ్ వద్ద రైతు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. డంప్‌యార్డ్ తమకు శాపంగా మారుతుందని, పంట పొలాలు నాశనమైపోతాయనికి, పర్యావరణానికి తరాలకు ప్రమాదం పొంచిఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డంప్‌యార్డ్ రద్దు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఉద్యమం ఉధృతరూపం దాల్చడంతో పోలీసులు భారీగా మోహరించి, జేఏసీ నాయకులపై నిఘా పెంచారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్నరైతులు



సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులతో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

అంతర్జాతీయ సదస్సులో

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సదస్సులో మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. 'తదుపరితరం పరిపాలనా సంస్కరణలు' అనే అంశంపై ఢిల్లీలో మంగళవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. మూడు జిల్లాల్లో పనిచేసిన రాహుల్‌రాజ్ తనపాలనాపరమైన అనుభవాలను దేశ విదేశీ ప్రతినిధులతో పంచుకున్నారు. ఇతర దేశాల్లోని పరిపాలన సంస్కరణల గురించి తెలుసుకున్నారు. సమావేశంలో వివిధ దేశాల బ్యూరోకాట్లు, అధికారులు హాజరయ్యారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

● ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్

మనోహరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి ఎన్నికల సమయంలో బీసీలకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీసీ కులస్తులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో రేవంత్‌రెడ్డి కామారెడ్డి సభలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే వచ్చిన ఆరునెలలకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే దొంగ సర్వే అని, ఇందులో బీసీల శాతం తక్కువగా చూపారన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల నాయకుడు దాసరి నరేష్, నాగభూషణం, పంజా భిక్షపతి, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు: సీడీపీవో

శివ్వంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సీడీపీవో హేమభార్గవి హెచ్చరించారు. మండల పరిధిలోని గోమారం, నవాబ్‌పేట్, బిజ్యాతండా, పిల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య లక్ష్మి భోజనం నాణ్యతపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు నిర్లక్ష్యం వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ కారు ఎవరిదో..!

- అర్ధరాత్రి గ్రామంలో చక్కర్లు
- మూడు కార్లు తిరిగినట్లు అనుమానం
- స్మగ్లర్లను ఛేజ్ చేసిన పోలీసులు?



గ్రామశివారులో కారు

మనూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అతిమ్యాల్ శివారులో అర్ధరాత్రి 2 గంటలు దాటిన తర్వాత కొందరు మూడు కార్లలో చక్కర్లు కొట్టడం ఆందోళనకు గురి చేసింది. ఉదయం చూడగా, గ్రామ సమీపంలో ఏపీ 39 ఎల్‌వీ 3856 నెంబరు గల కారును వదిలివెళ్లారు. విషయం పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కార్ నెంబరు ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన ముని రాజు కారుగా గుర్తించారు. అయితే, నిజామాబాద్ జిల్లాకు చెందిన పోలీసులు నిందితులు లేదా స్మగ్లర్ల కోసం కార్లను ఛేజ్ చేసినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారు అర్ధరాత్రి తర్వాత గ్రామ శివారులో చక్కర్లు కొట్టినట్లు భావిస్తున్నారు. పోలీసులు అర్ధరాత్రి ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీ అయినట్లు భావిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ శంకరయ్యను సంప్రదించగా, విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

కన్నీరుమున్నీరైన విద్యార్థులు


సలావుద్దీన్(ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తమకు పాఠశాలు చెప్పే సార్ ఇక లేరని ఆ విద్యార్థులు కన్నీరుమున్నీర య్యారు. ఆయనను తలుచుకుని వెక్కివెక్కి ఏడ్చారు. ఈ ఘటన మండల పరిధి కాట్రియాలలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కాట్రియాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేసే హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సలావుద్దీన్ (35) సోమవారం స్కూల్‌లో విధులు ముగించుకుని వెళ్తుండగా, మండలంలోని తోనిగుండ్ల శివారులో ఆయన ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన చనిపోయారు. మంగళవారం ఉదయం విషయం విద్యార్థులకు తెలియడంతో వారంతా పాఠశాల వద్ద సలావుద్దీన్ సార్‌ను గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరయ్యారు. పాఠశాల ఆవరణలో ఫోటోతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి సంతాపం తెలిపారు.

గంజాయి కేసులో మరో నిందితుడి అరెస్ట్

నంగునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న కేసులో ఇటీవల ఆరుగురుని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. అదే కేసులో ఏడో నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలం అంతాపూర్ గ్రామానికి చెందిన రవిజాదవ్ అలియాస్ సందీప్ జాదవ్ మంగళవారం మధ్యాహ్నం గంజాయి విక్రయించేందుకు మండలంలోని జేపీ తండాకు వచ్చాడు. నమ్మదగిన సమాచారం మేరకు రాజగోపాలపేట ఎస్సై ఆసిఫ్ తన సిబ్బందితో వెళ్లి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని నుంచి 359 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారించగా, గంలో పట్టుపడిన గంజాయి కేసులోనూ నిందితుడిగా తేలింది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కొండపాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధకు అనారోగ్యం తోడు కావడంతో ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన గట్ల శ్రీనివాస్ (52) కుటుంబం కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటోంది. దర్జీ పని చేసే శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో పాటు అప్పులు పెరిగిపోయాయి. సొంత ఊరికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి, సోమవారం బయలుదేరాడు. తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా లాభం లేకపోయింది. శ్రీనివాస్ కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో ఇంటి నుంచి ఫోన్ రావడంతో విషయం చెప్పారు. వారు కుమారుడు నిఖిల్ సిద్దిపేట ప్రబబత్వ ఆస్పత్రి వచ్చాడు. ఆస్పత్రిలో శ్రీనివాస్ చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మెడికల్ కళాశాలలో విద్యార్థుల ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిమిత్తం ముందేగా మృతదేహాన్ని తీసుకువచ్చి ప్రతిజ్ఞ చేయించి, గౌరవిస్తారు. అందులో భాగంగా మంగళవారం నిజామాబాద్ నుంచి మృతదేహాన్ని తీసుకువచ్చి మృతదేహం పట్ల గౌరవంగా ఉంటామని, తమకు విజ్ఞానాన్ని పంచేందుకు ఉపయోగపడుతున్నందున కృతజ్ఞులుగా ఉంటామని వైద్య విద్యార్థులు ప్రొఫెసర్లు మృతదేహం ముందు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలోలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, డాక్టర్ జయ, అనాటమీ విభాగం డాక్టర్ అర్చన, ఫిజియాలజీ విభాగం డాక్టర్ శాంతా కుమారి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివదయాళ్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

పుకార్ల మోతే..!

వరుస మరణాల ఆసరాగా వివాదాలు


మోతే గ్రామం

- ఆ చావుల వెనుక ఆర్థిక, అనారోగ్య సమస్యలు
- ఇరువర్గాల మధ్య విభేదాలతో తప్పుడు ప్రచారం
- పుకార్ల కట్టడికి నేడు గ్రామసభ

- అప్పులు తీర్చేందుకు ఆమె భర్త దుబాయ్ వెళ్లాడు. అక్కడ అనుకున్నంత పని దొరకలేదు. తిరిగివచ్చినా అప్పులు తీరే అవకాశం లేదు. ఆమె గుండెకు అప్పటికే రెండు స్టంట్లు పడ్డాయి. మనస్తాపం చెందిన ఆమె ఇంట్లోనే ఉరి వేసుకుంది. ఓ మహిళ భర్త నిత్యం మద్యం తాగుతుంటాడు. మూడేళ్ల నుంచి భర్తలో మార్పు వస్తుందని ఆశించింది. తల్లిదండ్రులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. భర్త అలవాటు వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఆమె ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది.
- ఆయనకు వృద్ధాప్యం మీదపడి లేవలేని స్థితి. కుమారుడు-కోడలు వేరుగా జీవిస్తున్నారు. ఒంటరి జీవితంతో విసిగిపోయాడు. ఏడాదిగా ఆత్మహత్య చేసుకుంటానని గ్రామంలో పలువురితో చెప్పేవాడు. చివరికి చెరువులో పడి చనిపోయాడు.

దుబ్బాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కారణాలు, అనారోగ్య సమస్యలు గ్రామంలో కొందరి మరణాలకు కారణమయ్యాయి. ఇదే అదనుగా ఆ మరణాల చుట్టూ రాజకీయాలు, ఇరు వర్గాల మధ్య విబేధాలు ముసురుకున్నాయి. గ్రామంలోని రెండు ఆలయాల మధ్య కొంత కాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న విబేధాలూ పుకార్లకు మరింత ఆజ్యం పోసినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట- భూంపల్లి మండలం మోతే గ్రామంలో సోమవారం 'వరుస మరణాల మోతే' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం నేపథ్యంలో గ్రామంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు మంగళవారం 'ఆంధ్రజ్యోతి' గ్రామానికి వెళ్లింది. మంగళవారం ఆ గ్రామ పెద్దలంతా సమావేశమై పుకార్లను కట్టడి చేయాలని నిర్ణయించారు. బుధవారం అన్ని కులాల పెద్దలను, అన్ని వర్గాలతో గ్రామ సభ నిర్వహించాలని నిర్ణయించారు. పుకార్లపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా.. గ్రామంలోని ఓ దేవాలయానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక మరో దేవాలయానికి చెందిన వారు, ఆ దేవాలయ ధర్మకర్తల వెనుక పార్టీలు ఉండటంతో వరుస మరణాలకు దేవాలయంలో జరుగుతున్న కారణాలే కారణమనే పుకార్లు షికార్లు చేస్తున్నట్లు చెప్పారు.

అసలేం జరుగుతోంది..

మోతే గ్రామంలో రెండు ఆలయాల్లో ధూపదీపాలకు నోచుకోక దీనస్థితికి చేరాయి. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొందరు గ్రామానికి చెందిన ఒకరిని ఆశ్రయించి, నిత్యపూజలు చేయాలని కోరారు. ఆయన సున్నితంగా తిరస్కరించడంతో జిల్లా కేంద్రంలో ఉంటున్న అదే గ్రామానికి చెందిన ఒకరికి బాధ్యతలు అప్పగించారు. జిల్లా కేంద్రంలో ఆయన వాస్తు, జ్యోతిష్యంతోపాటు శాంతిపూజలు కూడా చేస్తారని నమ్మకంతో భక్తులు ఎక్కువగా వచ్చేవారు. దోషాలు కూడా తొలగిస్తారనే నమ్మకంతో ఈ ప్రాంతం నుంచే కాకుండా సినిమా పరిశ్రమకు చెందిన వారు కూడా ఆయన వద్దకు వచ్చి ముహుర్తాలు పెట్టించుకుంటుంటారు. ఆయనే గ్రామంలోని ఓ ఆలయానికి పూజారి కావడంతో సదరు ఆలయానికి భక్తుల సంఖ్య పెరిగింది. ఆలయానికి ప్రాచుర్యమూ పెరిగింది. నిత్యం హోమాలు, వైదిక కార్యక్రమాలతో రద్దీగా మారింది. అయితే, తనకు వతన్‌గా ఉన్న గ్రామంలో మరొకరి పెత్తనం సహించలేని మరో ఆలయ పూజారి.. ఆ ఆలయంలో క్షుద్రపూజలు జరుగుతున్నాయని ప్రచారం మొదలు పెట్టాడు. అందువల్లే గ్రామంలో వరుసగా అనారోగ్యాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే ప్రయత్నం చేశాడు. అంతే కాకుండా గ్రామంలో దేవాలయ భూములను ఆక్రమించిన వారిని లక్ష్యంగా చేసుకుని కూడా పుకార్లు పుట్టిస్తున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు. పుకార్లతో గ్రామంలో భయాందోళనలు చెందుతున్నారన్నారు.

అవగాహన కల్పించాలి

గ్రామంలో పుకార్లు, మూఢ విశ్వాసాలతో భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. బుధవారం జరిగే గ్రామసభలో పోలీసులు, అధికారులు ప్రధాన పాత్ర పోషించి మూఢవిశ్వాసాలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

మెదక్‌లో వ్యాపారి బలవన్మరణం

ఆర్థిక ఇబ్బందులే కారణం

మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కిరాణా వ్యాపారి సాయిదీప్ రమేష్(54) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాలకు సుపరిచితుడైన ఆయన వ్యాపార రంగంలో మంచి పేరు సంపాదించారు. ఆకస్మాత్తుగా ఆయన ఆత్మహత్య చేసుకోవడం వెనుక ఆర్థిక ఇబ్బందులే కారణమని చెబుతున్నారు. మెదక్‌లో చిన్న కిరాణాషాపుతో తన వ్యాపారాన్ని ప్రారంభించిన రమేష్ అనతికాలంలోనే ఇక్కడి ప్రజలకు సూపర్ మార్కెట్‌ను పరిచయం చేశారు. మెదక్ ప్రాంతంలో పెళ్లి, విందు, ఏ చిన్న కార్యం జరిగినా నిత్యావసర సామగ్రి కొనుగోలు చేసేందుకు సాయిదీప్ సూపర్‌మార్కెట్‌కు వెళ్లాల్సిందే అన్నట్లుగా ఈ రంగంలో పేరు సంపాదించారు. అంతగా ఆయన వ్యాపారం ఎదగడానికి ఆయన వ్యవహార శైలి ప్రధాన కారణంగా చెబుతారు. కస్టమర్లను ఆప్యాయంగా పలకరించడంతో పాటు.. దగ్గరుండి సామగ్రిని మోటర్‌సైకిల్‌పై పెట్టే రమేష్ అంటే అందరికీ అభిమానం.

వెంటాడిన ఆర్థిక సమస్యలు?

సాయిదీప్ ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలే కారణమని చెబుతున్నారు. వ్యాపారంలో పోటీ పడేందుకు తక్కువ లాభాలకే వ్యాపారం చేసేవాడని, వ్యాపారానికి సొంత భవనం సమకూర్చుకునే క్రమంలో అప్పులు అయ్యాయని అంటున్నారు. వ్యాపారం బాగానే సాగిన అప్పులు ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.


రమేష్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పరామర్శించిన ఎమ్మెల్యే

సాయిదీప్ రమేష్ భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సందర్శించి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మంచి వ్యాపారవేత్తగా పేరు సంపాదించిన ఆయన మరణం తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు భౌతికకా యానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


ప్రయోగాలు చేసి చూపిస్తున్న ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య

ఎస్‌సీఈఆర్‌టీకి దామరకుంట టీచర్ ప్రదర్శన

మర్కుక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) ఏటా నిర్వహించే ఉపాధ్యాయుల సైన్స్ సెమినార్ పోటీలకు మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడి ప్రదర్శన ఎంపికైంది. పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వై. చిన్నబ్రహ్మయ్య రూపొందించిన 'పాఠశాల- ఒక వింత అభ్యాసాల వేదిక' అనే అంశం రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకట్ రాములు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 165 ప్రాజెక్టులు పోటీపడగా, వై. చిన్న బ్రహ్మయ్య రూపొందించిన ప్రాజెక్ట్ ఎంపికైందని తెలిపారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రావుకుమార్, దామరకుంట పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

ఏడుపాయలలో పకడ్బందీగా ఏర్పాట్లు

పరిశీలించిన మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


ఏడుపాయలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. జాతర నేపథ్యంలో మంగళవారం ఆయన ఏడుపాయల ఆలయం వద్ద పరిసరాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌జామ్ లేకుండా వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికపుడు ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, తదితరులున్నారు.

లింగ సమానత్వంపై జాతీయ సదస్సు

కంది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో లింగ గతిశీలతను విమర్శనాత్మకంగా విశ్లేషించేందుకు, లింగ సమానత్వంపై సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హెచ్‌లో మంగళవారం జాతీయ సదస్సును నిర్వహించారు. వికసిత్ భారత్-2047 ప్రాజెక్ట్ కోసం ఆత్మనిర్భర్ భేటీయన్‌లో భాగంగా దేశంలో బాలికల సాధికారతలో బేటీ బచావో బేటీ పడావో పాత్రను అన్వేషించే దిశగా ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ గౌహతి, ఐఐటీ ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ వర్సిటీ పరిశోధకులు పరిశోధనలు చేస్తున్నారు. ఇందుకు ఐఐటీహెచ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్ విభాగం షరతులతో కూడిన నిధులను అందజేస్తోంది. ఈ నేపథ్యంలో బాల్యవివాహాలు తగ్గించడం, భ్రూణహత్యలు, బాలికల సామాజిక-ఆర్థిక భవిష్యత్ సమస్యలు పరిష్కరించడం వంటి అంశాలను ఈ సదస్సులో చర్చించారు. సదస్సులో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌లో విద్యావిషయక పరిజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో అర్థవంతమైన మార్పును అందించే పరిశోధనలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. దేశంలో లింగ సమానత్వం, బాలికల సాధికారతకు కట్టుబడి ఉన్నామని ఐఐటీహెచ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిందితా మజుందార్ వెల్లడించారు.


సదస్సులో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు



ఈ జైలు.. ఇక చరిత్రే..!

కనుమరుగు కానున్న 229 ఏళ్ల నాటి సంగారెడ్డి జైలు.. శిథిలావస్థకు భవనం

అప్పట్లోనే అనేక సంస్కరణలు- 2016లో హెరిటేజ్ జైలు మ్యూజియంగా ఏర్పాటు

ఆదరణ లేక మూతపడిన 'ఆయుర్వేదిక్ విలేజ్'

సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, ఆల్బమ్స్ చిత్రీకరణకు వేదిక- ఆధునికీకరిస్తే ప్రయోజనం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వారసత్వ సంపద కారాగార ప్రదర్శనశాల శిథిలావస్థకు చేరుకుంటుంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని 229 ఏళ్ల చరిత్ర ఉన్న హెరిటేజ్ జైలు మ్యూజియం క్రమ క్రమంగా కూల్చివేతలకు గురై నిరుపయోగంగా మారింది. 1796లో ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో జిల్లా జైలును నిర్మించారు. ఆ తర్వాత కంది శివారులో జిల్లా జైలుకు నూతన భవనం నిర్మించడంతో 2012 ఏడాదిలో దీనిని అక్కడికి తరలించారు. ఈ నేపథ్యంలో పాత జిల్లా జైలును 2016 జూన్ 5న హెరిటేజ్ జైలు మ్యూజియంగా మార్చారు.

ఫీల్ ది జైల్‌కు వేదిక..

జైళ్ల శాఖ డీజీగా వీ.కే.సింగ్ ఉన్న క్రమంలో 'మై నేషన్ ఫిల్లింగ్ స్టేషన్' పేరిట పెట్రోల్ బంకులు నెలకొల్పి, ఖైదీల శిక్షా కాలం పూర్తయిన తర్వాత వారు సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో అవే పెట్రోల్ బంకుల్లో ఉపాధి కల్పించారు. ఖైదీల చేత వివిధ రకాల ఉత్పత్తులు, దుస్తులు, ఫర్నీచర్ తయారు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచి అమ్మకాలు చేపట్టి, జైళ్ల శాఖకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్నారు. ఇదే క్రమంలో 2016 జూన్ 5 న సంగారెడ్డిలోని పాత జిల్లా జైలును హెరిటేజ్ జైలు మ్యూజియాన్ని తీర్చిదిద్దారు. ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఈ జైలు మ్యూజియంలో పురాతన శిక్షలకు సంబంధించిన ఆనవాళ్లు, కఠిన శిక్షల గురించిన చిత్రాలను అమర్చారు. పాత తరం జైళ్లలో వినియోగించిన పరికరాలు, ఖైదీలు వినియోగించే వస్తువులను ప్రదర్శనకు పెట్టారు. మసాజ్ కోసం కేరళ ఆయుర్వేదిక్ విలేజ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా జైలు జీవితం గడపాలనుకునే వారు (ఫీల్ ది జైల్)పేరిట రూ.500 చెల్లిస్తే ఒక రోజంతా అచ్చం ఖైదీ మాదిరిగా కారాగారంలో గడిపే అవకాశం ఈ మ్యూజియంలో కల్పించారు. ఎంతో మంది ప్రముఖులు, వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఒక రోజు జైలులో ఉండే అనుభూతిని పొంది వెళ్లారు. సినిమాల్లో కనిపించే పలు ఫైటింగ్ సీన్స్, రెయిన్ సీన్స్, జైలులో ఖైదీల అవతారం ఇలా పలు రకాల సన్నివేశాలను ఇదే జైలు మ్యూజియంలో చిత్రీకరించారు. సెట్టింగ్‌లకు ఖర్చు కలిసొస్తుందనే ఉద్దేశంలో సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, ఆల్బమ్స్ చిత్రీకరణకు ఈ మ్యూజియం అప్పట్లో వేదికగా మారిందని చెప్పవచ్చు.

శిథిలావస్థకు..

సంగారెడ్డి పట్టణంలోని హెరిటేజ్ జైలు మ్యూజియం సుమారు నాలుగున్నర ఎకరాల్లో ఉంది. మ్యూజియం వెనకాల జైళ్ల శాఖకు చెందిన కొంత స్థలంలో ప్రస్తుతం ఆ శాఖ ఆధ్వర్యంలో 2019 నుంచి బీపీసీఎల్ పెట్రోల్ బంక్ కొనసాగిస్తున్నారు. ఇదే మ్యూజియం భవనంలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లా సబ్‌జైళ్ల అధికారి(డీఎస్‌జేవో) కార్యాలయం కొంత కాలంగా ఉంది. అయితే ఈ మ్యూజియం ఒక పక్క నుంచి కూలిపోతూ శిథిలావస్థకు చేరుతుండడంతో ఆ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. 2020 ఏడాదిలో 'ఫీల్ ది జైలు' బ్యారక్ వర్షానికి కూలిపోయింది. అంతకుముందు ఆదరణ లేకపోవడంతో మై నేషన్ కేరళ ఆయుర్వేదిక్ విలేజ్ పేరిట ఏర్పాటు చేసిన మసాజ్ కేంద్రం కూడా ఈ మ్యూజియంలో మూతపడింది. ఇంతలో కరోనా కాలం రావడంతో షూటింగ్‌లు కూడా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఏటా వర్షాలకు క్రమంగా మ్యూజియం కూల్చివేతలకు గురై శిథిలావస్థకు చేరి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. కాగా, ఇందులోని సామగ్రిని కూడా ఇప్పటికే కందిలోని సెంట్రల్ జైలుకు తరలించారు. ఇప్పటికైన ప్రభుత్వం నిరుపయోగంగా మారిన ఈ వారసత్వ సంపద కారాగార ప్రదర్శనశాలను(హెరిటేజ్ జైలు మ్యూజియం) అభివృద్ధి చేయడం లేదా ఆధునీకరించి ఇతర అవసరాలకు వినియోగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

న్యూస్ బాక్స్

టీబీ లక్షణాలను గుర్తించాలి

మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుష్టు వ్యాధి నివారణపై తగిన చర్యలు తీసుకోవాలని, టీబీ లక్షణాలను రోగుల్లో గుర్తించాలంటూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ సూచించారు. రామాయంపేట మండల పరిధి డి.ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

పోతిరెడ్డిపల్లిలో 'రైతునేస్తం'

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు ఉపయోగపడేలా రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ జేడీ శివప్రసాద్ అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతువేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

స్టాండింగ్ కమిటీ సభ్యురాలి పదవికి నామినేషన్

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీలో స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా తనకు అవకాశం కల్పించాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. తాను కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

కంగ్టి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మోక్షాన్ని పొందాలంటే ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని మహారాష్ట్రలోని దెగ్లూర్‌గుండా మహరాజ్ పీఠాధిపతి చంద్రశేఖర్‌మహరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని భీంరాలో నిర్వహించిన గాథ పూజలో పాల్గొని భక్తులకు అనుగ్రహ బాషణం చేశారు. అనంతరం భీంరా గ్రామానికి చెందిన భక్తులు మహరాజ్‌ను గజమాలతో సత్కరించారు.

ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్‌జంట గ్రామమైన మంగల్‌పేట కుమ్మరి గల్లీలోని వీరభద్రేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఖేడ్ డివిజన్ నాలుగో తరగతి అధ్యక్షుడిగా నర్సింహులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ డివిజన్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సున్నం నర్సింహులు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నారాయణఖేడ్ టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు చంద శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జహీరాబాద్ అధ్యక్షుడు క్రిష్ణవంశీ, ఈసీమెంబర్ బాలమణి మంగళవారం తెలిపారు. కార్యదర్శిగా బాగన్న, ఉపాధ్యక్షుడిగా అనిల్, కోశాధికారిగా నర్సింహరాజు, జాయింట్ సెక్రెటరీగా సుదర్శన్, ప్రచార కార్యదర్శిగా ఆశయ్య, ఈసీ సభ్యులుగా లక్ష్మి, సుమీనా బేగం, లింగయ్య ఎన్నికైనట్లు తెలిపారు.

సేవాలాల్ జయంతి నిర్వహించాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని 14న అన్ని గిరిజన తండాల్లో జరుపుకోవాలని ఇరకపల్లి ఆశ్రమ పీఠాధిపతి దేవిదాస్ మహరాజ్ కోరారు. మంగళవారం సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, తదితరులతో కలిసి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

నవీన్‌గుప్తాకు సన్మానం

శివ్వంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివ్వంపేట ప్రాథమిక పాఠశాల భవనం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పులుమామిడి నవీన్‌గుప్తా తన సొంత నిధులు రూ.8 లక్షలు వెచ్చించి అసంపూర్తి పనులు పూర్తిచేయించాడు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట: పాపన్నపేట మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నర్సింహులు తెలిపారు. వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా మిన్పూర్ 33 కేవీ ఫీడర్ పనులు చేపడుతున్నామని చెప్పారు. అందువల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని కుర్తివాడ, యూసుఫ్‌పేట, మిన్పూర్ గ్రామాలకు ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల

- ఎన్నికల కోసం సిద్ధమవుతున్న అధికారులు
- అభ్యంతరాలు, ఫిర్యాదులపై రాజకీయ పార్టీలతో సమావేశం

నర్సాపూర్/మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం అధికారులంతా సిద్ధమవుతున్నారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఖరారు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలో మంగళవారం నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల (డ్రాఫ్ట్) జాబితాను ఎంపీడీవో మధులత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 11న డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేయగా.. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 13వ తేదీ లోపు మండల పరిషత్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా అందజేయాలన్నారు. 14న అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కరించి చివరి పబ్లికేషన్ 15న విడుదల చేస్తామన్నారు. ఇదిలా ఉండగా నర్సాపూర్ మండలం మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. మొత్తం ఓటర్లు 27,820 మంది. ఇందులో మహిళలు 14,236, పురుషులు 13,583 మంది ఉన్నారని ఎంపీడీవో తెలిపారు.

● చిన్నశంకరంపేట మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలు, 1 జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి మంగళవారం ఓటరు జాబితాను ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో దామోదర్ ప్రకటించారు. నోటీస్ బోర్డుల వద్ద ఓటర్ల జాబితాను ఉంచారు. పంచాయతీలవారీగా జాబితాను సిద్ధం చేశారు. దీనిని ప్రామాణికంగా తీసుకుని.. అదనంగా వచ్చిన ఓటర్ల సంఖ్యతో తుది జాబితాను సిద్ధం చేసి ప్రకటిస్తారు. ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు.

● చేగుంట మండల పోలింగ్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఎంపీడీవో చిన్నారెడ్డి మంగళవారం విడుదల చేశారు. మండలంలోని 12 ఎంపీటీసీలకుగానూ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీలో ఓటర్ ముసాయిదా ప్రచురించారు. మండలంలోని


చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల పోలింగ్ స్టేషన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దృశ్యం

అనంతసాగర్ బోనాల కొండాపూర్, చందాయిపేట్, చేగుంట 1, చేగుంట 2, గొల్లపల్లి, కర్నాల్‌పల్లి, ఇబ్రహీంపూర్, రుక్మాపూర్, వడియారం, మక్కరాజపేట్, రెడ్డిపల్లి, 12 ఎంపీటీసీలకుగానూ 71 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని 33,335 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 15,585 మంది, స్త్రీలు 16,749 ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అబద్ధపు మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా నిరుపేదలకు ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కందిలో మంగళవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో చెప్పిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా ఇప్పటికీ సరిగా అమలు కాలేదని విమర్శించారు. చేసిన పథకానికే ఒక్కొక్కరు నాలుగు సార్లు దరఖాస్తులు చేసుకుంటుంటే జీరాక్స్ షాపులు లాభాల బాటపడుతున్నాయన్నారు. కాంగ్రెస్ అబద్ధాలను ప్రజలు త్వరలోనే ఎండగడతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

నరహరిరెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, కృష్ణాగౌడ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కంది మండలంలోని చిమ్నాపూర్‌లో కట్టమైసమ్మ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని మంగళవారం మత్స్యకార సంఘం సభ్యులు వైభవంగా నిర్వహించారు. మత్స్యకార సంఘం అధ్యక్షుడు మన్నె అశోక్, కార్యదర్శి తలారి వీరన్న ఆధ్వర్యంలో అమ్మవారికి కల్యాణం జరిపించారు. ఇందులో ఎమ్మెల్యే పూజలు చేశారు.

ఎన్నికల నిర్వహణలో తప్పులు దొర్లొద్దు

● సంగారెడ్డి ట్రైనీ కలెక్టర్ మనోజ్


సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణలో తప్పులు దొర్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని సంగారెడ్డి ట్రైనీ కలెక్టర్ మనోజ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఏఆర్వో, ఆర్వోలకు నిర్వహించిన శిక్షణా తరగతుల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎక్కడైనా తప్పులు జరిగితే అందరం బాధ్యులమవుతామని స్పష్టం చేశారు. ఎన్నికల కేంద్రాల వద్ద పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు సమాచారమందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాంరెడ్డి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తమను నమ్మి ఓటేసిన పాపానికి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ విమర్శించారు. మంగళవారం ఆయన జోగిపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు సాయం ఆపేసిన సర్కార్.. కనీసం మద్దతు ధరను కూడా కల్పించలేకపోతోందన్నారు. దీంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. అందోలు నియోజకవర్గంలో రైతులు కంది, మిర్చి, పత్తి పంటలను పండిస్తారన్నారు. వీటి అమ్మకానికి మార్కెట్ సదుపాయం కల్పించలేని స్థితిలో ప్రభుత్వం లేదన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ రూపొందించిన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీసీబీ


మాట్లాడుతున్న క్రాంతికిరణ్

మాజీ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పీ.నారాయణ, డీబీ.నాగభూషణం, అందోలు మాజీ ఎంపీపీ అధ్యక్షుడు బాలయ్య, అందోలు, టేక్మాల్, అల్లాదుర్గం అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, భక్తుల వీరన్న, నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే జోగిపేటలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ బోనాల ఉత్సవంలో క్రాంతికిరణ్ పాల్గొని పూజలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న జరుగనున్న మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణకు విధులు కేటాయించిన పీవోలు, ఏపీవోలు, సెక్టార్, నోడల్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు-22 ఏర్పాటు చేశామన్నారు. 11,953 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 21 ఏర్పాటు చేయగా 1,281 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసచారి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలి

నారాయణఖేడ్/కల్హేర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం ఉండాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖేడ్ నియోజకవర్గం నుంచి మహారాష్ట్రలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన పండరీపూర్ విఠలేశ్వర ఆలయానికి పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకొని తిరిగి వచ్చిన భక్తులు మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయనను కలిసి, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కిష్టయ్యమాస్టర్, మాజీ సర్పంచ్ వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు. అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక ప్రజలను మోసం చేస్తున్నదని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన కల్హేర్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత హయాంలో కొనసాగిన పథకాలే సక్రమంగా అమలు చేయడం లేదని, ఇంకా మేనిఫెస్టోలో పెట్టిన హామీల అమలు చేస్తారా.. అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంసింగ్, ఎంపీపీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.గని తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి


పౌష్టికాహారంపై సూచనలిస్తున్న హైమావతి

నిజాంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పసి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి హైమావతి అన్నారు. నిజాంపేట మండలం రజాక్‌పల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అలాగే నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం గురించి డీఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హోరాహోరీగా 'కుస్తీ'


కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

టేక్మాల్/న్యాల్‌కల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో తుంబురేశ్వర స్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన మల్లయోధులతో పాటు సమీపంలోని కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో జూకల్ మండలం అంతపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ విజేతగా నిలిచాడు. అలాగే మండల కేంద్రమైన న్యాల్‌కల్ గట్టుపై గల ఉర్సే షరీఫ్ పీర్ గైబు సాహెబ్ దర్గా వద్ద కొనసాగుతున్న జాతరలో భాగంగా మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి వెండి కడియం అందజేశారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో సమకూరుతున్న సౌకర్యాలు

- మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు
- ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన ఆర్డీవో పాండు

పుల్‌కల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలోని గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మౌలిక సౌకర్యాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం అందడం లేదంటూ విద్యార్థులు ఇటీవల ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి అఖిలేష్ రెడ్డి, అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, చౌటకూర్ తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ పాఠశాలను సందర్శించి రాత్రి బసచేశారు. ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయి. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు, ఆర్వో ప్లాంట్, కిటికీలకు దోమల జాలీలను అమర్చేందుకు హామీఇచ్చారు. ముందుగా ఆర్వో ప్లాంట్ మంజూరు కావడంతో మంగళవారం అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు. గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్డీవో పాండు బోధన సిబ్బందికి సూచించారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.సోనేష్, ఆర్.దేవదాస్, జె.మహేశ్, డి.ధన్‌సింగ్ యువ ఖేల్ ఉత్సవ్-2025 జిల్లాస్థాయి క్రీడల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఆర్డీవో పాండు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, వార్డెన్ శోభ అభినందించారు.

పరిశ్రమ తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

● అక్రమంగా నక్కవాగు వరకు పైపులైన్ వేస్తున్నారంటూ ఆందోళన

మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులో గల కోవాలెంట్ లేబొరేటరీస్ పరిశ్రమ యాజమాన్యం తీరు పట్ల గ్రామస్థులు ఆగ్రహ వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. సోమవారం రాత్రి కొందరు స్థానికుల సహకారంతో పరిశ్రమ యాజమాన్యం పైపులైన్ తీయడాన్ని తప్పుపట్టారు. గ్రామస్థులు మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకొని పైపులైన్ కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తులను నిలదీశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి గతంలో వేసిన పైపులైన్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా, లెక్క చేయలేదు. పరిశ్రమ యాజమాన్యం ఇక్కడికి వచ్చి నూతన పైపులైన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. చేసేదిలేక పోలీసులు పరిశ్రమ యాజమాన్యానికి సమాచారం ఇచ్చి పరిశ్రమ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డిని అక్కడికి రప్పించారు. పరిశ్రమ యాజమాన్యం నూతనంగా వేస్తున్న పైపులైన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. దీంతో పరిశ్రమ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన పైపులైన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు గ్రామపంచాయతీకి రాతపూర్వకంగా రాసి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఈ విషయమై కలెక్టర్, పీసీబీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.


పోలీసులతో వాగ్వివాదానికి దిగిన గ్రామస్థులు

కొట్టేసింది కొండంత.. తిరిగొచ్చింది కొంతే!

● 5వ పేజీ తరువాయి

ద్వారా సేకరించిన సమాచారంతో మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డావంటూ ఫోన్ వీడియో కాల్‌లో బెదిరింపులకు పాల్పడుతున్నారు. బాధితులను సైబర్ అరెస్టు చేశామని, కదలడానికి వీల్లేదని భయపెట్టి బ్యాంకు ఖాతా, ఓటీపీ తదితర వివరాలను తెలుసుకుని, ఖాతా నుంచి డబ్బులు కాజేస్తున్నారు. చట్టాల్లో డిజిటల్ అరెస్ట్ అనే వ్యవస్థే లేదు, సీబీఐ, ఈడీ, ఐటీ అధికారులు వీడియో కాల్స్ చేసి విచారణ చేయరని స్పష్టం చేస్తున్నారు. +92 నంబరుతో కాల్స్ వస్తే ఎత్తకూడదని పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు.

సొమ్ము కోసం పడిగాపులు

సైబర్ నేరాల బాధితులు తమ డబ్బును తిరిగి ఇప్పించాలని బ్యాంకులు, పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం ఖాతాలో ఉన్న డబ్బు హోల్డ్ చేశాని, సైబర్ క్రైం నమోదైనందున పోలీసులను ఆశ్రయించాలని చెబుతున్నారు. తాము పోగొట్టుకున్న డబ్బును ఎలా రాబట్టుకోవాలో తెలియక బాధితులు సతమతమవుతున్నారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన డి.స్వప్న అనే మహిళ తన బ్యాంకు ఖాతా నుంచి రూ.8వేల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొట్టేయడానికి ప్రయత్నించిన క్రమంలో ఆ డబ్బు హోల్డ్ చేశారు. ఆ డబ్బు తిరిగి ఇప్పించాలని కోరితే సైబర్ క్రైం అయినందున డబ్బు తిరిగి రావడానికి సమయం పడుతుందని బ్యాంకు అధికారులు సమాధానమిస్తున్నారని ఆమె వాపోతున్నారు.

అత్యాశే కొంప ముంచుతోంది

తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశే శాపంగా మారుతోంది. ఎవరైనా ఉచితంగా డబ్బులు ఇస్తామంటే నమ్మొద్దు. మొబైల్ ఫోన్లలో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయకూడదు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసినా స్పందించకూడదు. డిజిటల్ అరెస్ట్ లేదా కేసు నమోదైదందని ఫోన్ వస్తే భయపడొద్దు. సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే 1930 నంబర్‌కు, లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

-సీహెచ్ రూపేష్, సంగారెడ్డి ఎస్పీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

● జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ గెలవడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో తన స్వగృహంలో రెండు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను సంబంధిత ఇన్‌చార్జిలకు అప్పగించిన సందర్భంగా మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. ఓటర్లు కూడా బీజేపీ పట్ల సానుకూలంగా ఉన్నారని కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని, ప్రజలు వారికి బుద్ధిచెప్పడానికి ఈ ఎన్నికలు దోహదపడతాయన్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాల్లో పద్మారెడ్డి

మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రెండోరోజైన మంగళవారం మల్లన్న బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. వేడుకల్లో భాగంగా యాదవులు బోనాలు సమర్పించారు. అనంతరం రామాయంపేట పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా ఆలయానికి చేరుకున్న ఎడ్లబండ్లు గుడి చుట్టూ తిరిగాయి. ఈ సాయంత్రం మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి మల్లన్నకు మొక్కులు చెల్లించారు. పిదప జాతరలో తిరిగిన పద్మారెడ్డి తనకు నచ్చిన గాజులను కొనుగోలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో చేరుకొని దర్శనం చేసుకున్నారు.

పోలీసుల పనితీరు భేష్: డీఎస్పీ

వట్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పనితీరు భేష్ అని సంగారెడ్డి డీఎస్పీ ఏ.సత్తయ్య అన్నారు. మగళవారం వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న వెంకటఖ్వాజా ఆశ్రమాన్ని సందర్శించారు. 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వెంకటఖ్వాజా ఆశ్రమంలో జరిగే ఉత్సవాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జోగిపేట సీఐ అనిల్‌కుమార్, వట్‌పల్లి ఎస్ఐ విఠల్, సిబ్బంది ప్రతాప్ ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

నర్సాపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడితే జరిమానా తప్పదని మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, వార్డు అధికారులు ఉదయ్, రాములు హెచ్చరించారు. మంగళవారం వారు పట్టణంలో పర్యటించారు. యాక్టు ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బాగులు, ఏక వినియోగ ప్లాస్టిక్‌లను వినియోగించడం నిషేధమన్నారు. ఒకవేళ వినియోగిస్తే రూ.2 వేల నుంచి రూ.10 వేల జరిమానా విధించే అవకాశం ఉన్నదన్నారు.

అర్చకుడు రంగరాజన్‌పై దాడి అమానుషం

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నామని శ్రీ వైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు, శ్రీ వైకుంఠపురం ప్రధాన అర్చకుడు, శ్వాస్ రాష్ట్ర కమిటీ ప్రధాన సభ్యుడు డా.కందాళ వరదాచార్యస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు రంగరాజన్‌పై దాడి చాలా అమానుషమైనదని, ఇటువంటి దాడులను ప్రతిఘటించాల్సిన అవసరముందన్నారు. చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు స్వామి రంగరాజన్‌పై దాడి సరికాదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు

కల్హేర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోమ్యానాయక్, ఇందిరానగర్‌తండాలకు చెందిన నలుగురు బాలికలు జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు 9న నిర్వహించారు. ఈ పోటీల్లో కల్హేర్ పోమ్యానాయక్‌తండాకు చెందిన అశ్విని, ఇందు, ఇందిరానగర్‌తండాకు చెందిన దీప్తి, అనిత ప్రతిభచాటారు. ఇందులో గోల్డ్‌మెడల్ సాధించగా, అశ్విని, దీప్తి సిల్వర్ మెడల్స్, అనిత బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్లు క్రిష్ణాపూర్‌కు చెందిన కరాటే మాస్టర్ వడ్ల ప్రసాద్ మంగళవారం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. చిన్నశంకరంపేట మండలం దరిపల్లికి చెందిన కొల్చారం శంకర్(42) మంగళవారం సాయంత్రం మాసాయిపేట మండల కేంద్రంలోని ప్రకృతి వైన్స్ వద్ద చనిపోయి ఉన్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని, పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ అస్తిపంజరం లభ్యం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్-ఎల్గొయి గ్రామశివారులో గల జలవాగులో సుమారు 45-50 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని మహిళ అస్తిపంజరాన్ని మంగళవారం గుర్తించినట్లు జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంతు తెలిపారు. వర్షాకాలంలో నీటి ఉధృతికి వాగులో కొట్టుకుని వచ్చి మృతిచెందినట్లు చెప్పారు. మృతేరాలి ఒంటిపై నల్లటి స్వెటర్ ఉన్నదని, ఆమె మృతిచెంది సుమారు నాలుగునెలలు కావస్తుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.